## ఆర్డిటీ ఆధ్వర్యంలో బాల బాలికలకు కిషోరి వికాసంపై అవగాహన



యాడికి, మే 15 (అనంత ప్రభ )
యాడికి మండల కేంద్రంలోని ఆర్డిటి పాఠశాలలో కిషోరి వికాసంపై బాలబాలికలకు అవగాహన సదస్సు నిర్వహించారు. తాడిపత్రి ఆర్‌డిటి ఏటీఎల్ లలిత ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో టీనేజ్ విద్యార్థులకు శారీరక, మానసిక మార్పులు, ఆరోగ్య సంరక్షణ, విద్య ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా లలిత మాట్లాడుతూ కిషోర్ వికాసం ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న సమ్మర్ సెషన్స్ ద్వారా యువతలో వ్యక్తిత్వ వికాసం, ఆరోగ్య చైతన్యం, పోషకాహారంపై అవగాహన పెంపొందించడం ముఖ్య ఉద్దేశమన్నారు. బాల్య వివాహాల నివారణతో పాటు విద్య ద్వారానే భవిష్యత్‌ను ఉన్నతంగా తీర్చిదిద్దుకోవచ్చని సూచించారు. టీనేజ్ దశలో ఎదురయ్యే శారీరక, మానసిక మార్పులను సానుకూలంగా స్వీకరించి, యువత తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని తెలిపారు. సమాజంలో బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ మంచి పౌరులుగా ఎదగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ హేమావతి, సీబీటీ సభ్యులు విజయలక్ష్మి, అమరావతి తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ డెంగ్యూ దినోత్సవం నిర్వహణ




యాడికి, మే 15 (అనంత ప్రభ)
జిల్లా మలేరియా అధికారి డి ఓబులు ఆదేశాల మేరకు చుక్కలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం జాతీయ డెంగ్యూ దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ లావణ్య, డాక్టర్ కీర్తి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డెంగ్యూ అవగాహన బ్యానర్‌ను చంద్రన్న సంచార చికిత్సలయం జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ విష్ణుమూర్తి ఆవిష్కరించారు. అనంతరం పులిపొద్దుటూరులో నిర్వహిస్తున్న చంద్రన్న సంచార చికిత్సలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి ఎన్‌సీడీ, ఏఎన్‌సీ నమోదులను పరిశీలించారు. ఈ సందర్భంగా తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు గ్రామ ప్రజలకు డెంగ్యూ నివారణ చర్యలు, పరిసరాల పరిశుభ్రత, ఫ్రైడే డ్రైడే కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఎండ తీవ్రత దృష్ట్యా ఉదయం 11 గంటలలోపు పనులు ముగించుకుని ఇళ్లలోనే ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ లక్ష్మన్న, ఎంపీ నారాయణ, నాగజ్యోతి, నారాయణస్వామి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## కిశోరుల సాధికారతపై ఆర్‌డీటీ అవగాహన సదస్సు





యాడికి, మే 15 (అనంత ప్రభ )
ఆర్‌డీటీ సంస్థ ఆధ్వర్యంలో యాడికి మండలం పెద్దపేట గ్రామంలో కిశోరి బాలబాలికల సాధికారత కోసం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సందర్భంగా కోఆర్డినేటర్ ఆంజనేయులు మాట్లాడుతూ కిశోర దశలో ఆరోగ్య సంరక్షణ, వ్యక్తిగత పరిశుభ్రత, విద్య ప్రాధాన్యత, ఆత్మవిశ్వాసం వంటి అంశాలపై అవగాహన కల్పిస్తూ విద్యార్థులు మంచి లక్ష్యాలతో ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, ఆర్‌డీటీ సిబ్బంది బాల బాలికలు పాల్గొన్నారు.

## శ్రీ భైరవలింగేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు



యాడికి, మే 15 (అనంత ప్రభ)
యాడికి మండల కేంద్రంలోని భైరవకొండపై వెలసిన శ్రీ విజయాంబికా భైరవలింగేశ్వర స్వామి ఆలయంలో మాస శివరాత్రి సందర్భంగా శుక్రవారం భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయంలో శివపార్వతుల వారికి అభిషేకాలు, అర్చనలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాస శివరాత్రి సందర్భంగా భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. పూజా కార్యక్రమాల అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు




## మానవత్వాన్ని చాటుతున్న మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్



యాడికి, మే 15 (అనంత ప్రభ )
ఆపదలో ఉన్నవారికి అండగా నిలుస్తూ సేవా కార్యక్రమాలతో గుర్తింపు పొందుతున్న యాడికికి చెందిన మే ఐ హెల్ప్ యూ ఫౌండేషన్ మరోసారి తన మానవత్వాన్ని చాటుకుంది. తాడిపత్రి పట్టణంలో ఒంటరిగా నివసిస్తూ అనారోగ్యంతో మృతి చెందిన సఫారే నాగరత్న (71) అనే వృద్ధురాలికి బంధువులు ఎవరూ లేకపోవడంతో ఫౌండేషన్ సభ్యులే ముందుండి అంత్యక్రియలు నిర్వహించారు. స్వకులసాళి ఏపీ ప్రెసిడెంట్ కమలే నగేష్ సమాచారం మేరకు యాడికి నుంచి తాడిపత్రికి చేరుకున్న ఫౌండేషన్ సభ్యులు చందగాని ధ్రువనారాయణ, సాకరే శంకరప్ప, పల్లా శ్రీరంగ, టి.లక్ష్మీకాంతమ్మలు వృద్ధురాలి భౌతికకాయానికి హిందూ సాంప్రదాయ పద్ధతిలో అంతిమ సంస్కారాలు నిర్వహించి మానవత్వాన్ని చాటుకున్నారు. అనాథగా మిగిలిన వృద్ధురాలికి గౌరవప్రదంగా వీడ్కోలు పలకడం స్థానికులను కదిలించింది. కేవలం అంత్యక్రియలకే పరిమితం కాకుండా మే ఐ హెల్ప్ యూ ఫౌండేషన్ సమాజ సేవలో నిరంతరం ముందుంటోంది. అత్యవసర పరిస్థితుల్లో రోగులు, గర్భిణీలకు అవసరమైన రక్తాన్ని సమకూర్చేందుకు సభ్యులు స్వయంగా రక్తదానం చేస్తూ ప్రాణదాతలుగా నిలుస్తున్నారు. అలాగే ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేయడంతో పాటు పేద విద్యార్థులకు నోట్ పుస్తకాలు, స్టేషనరీ సామగ్రిని ఉచితంగా అందజేస్తున్నారు. గ్రామీణ ప్రాంత ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తూ సేవలు అందిస్తున్న ఫౌండేషన్ సభ్యులు, ఎవరూ లేని అనాథలు మృతి చెందిన సందర్భాల్లో దహన సంస్కారాలు నిర్వహిస్తూ తమ ప్రత్యేకతను చాటుకుంటున్నారు. ఎలాంటి ప్రతిఫలం ఆశించకుండా సమాజ శ్రేయస్సే లక్ష్యంగా సేవలు అందిస్తున్న మే ఐ హెల్ప్ యూ ఫౌండేషన్ సభ్యులను తాడిపత్రి, యాడికి ప్రాంత ప్రజలు అభినందిస్తున్నారు

## జలధార స్ఫూర్తితో యాడికి కాలువ పరిశీలన



యాడికి, మే 15 (అనంత ప్రభ)
ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేపట్టిన జలధార కార్యక్రమం స్ఫూర్తితో యాడికి కాలువ ద్వారా చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించేందుకు చర్యలు వేగవంతమయ్యాయి. ఈ నేపథ్యంలో తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి ఆదేశాల మేరకు ఇరిగేషన్ అధికారులు శుక్రవారం యాడికి కాలువను పరిశీలించి ప్రణాళికను సిద్ధం చేశారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా కాలువ ద్వారా సమృద్ధిగా నీరు చేరేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించినట్లు నాయకులు తెలిపారు. వెంటనే స్పందించిన ఇరిగేషన్ శాఖ అధికారులు కాలువ పరిస్థితిని పరిశీలించి అవసరమైన పనులపై ప్రాథమిక నివేదిక రూపొందించారు. ఈ కార్యక్రమంలో డీఈ వెంగముని, జేఈలు చెన్నారెడ్డి, శివశంకరప్ప మరియు టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు వేలూరు రంగయ్య, టిడిపి మండల కన్వీనర్ దడియాల ఆది, మాజీ మండల కన్వీనర్ మాదాల అనిల్, రూపునేని రాజశేఖర్, శరభారెడ్డి, జాఫర్, నాగరాజ్ గౌడ్, నరేంద్రబాబు, ఓబులేసు తదితర టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## చిన్న జలాలపురంలో త్రాగునీటి సమస్యకు తక్షణ పరిష్కారం టిడిపి నాయకుడు సుధాకర్



శింగనమల, మే 15 (అనంత ప్రభ)
ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ ఆదేశాలతో స్పందించిన తెలుగుదేశం పార్టీ నాయకులు స్వచ్ఛందంగా నీటి ట్యాంకర్ల ఏర్పాటు
శింగనమల నియోజకవర్గంలోని చిన్న జలాలపురం గ్రామంలో గత రెండు మూడు రోజులుగా త్రాగునీటి సమస్య తీవ్రంగా ఉండడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వేసవి తీవ్రత పెరగడంతో గ్రామంలో త్రాగునీటి కొరత మరింత అధికమై ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు.
గ్రామస్తుల సమస్యను తెలుసుకున్న శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ వెంటనే స్పందించి గ్రామంలో త్రాగునీటి సమస్య లేకుండా చూడాలని సూచించారు.
ఎమ్మెల్యే సూచనల మేరకు తెలుగుదేశం పార్టీ నాయకులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి గ్రామ ప్రజలకు తక్షణ ఉపశమనం కలిగించేలా నీటి ట్యాంకర్లను ఏర్పాటు చేశారు.
గ్రామ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నీటిని సరఫరా చేస్తూ సేవా భావంతో పనిచేశారు. దీంతో గ్రామస్తులు ఊరట పొందారు. ప్రజా సమస్యలపై వెంటనే స్పందించి తమ గ్రామానికి త్రాగునీటిని అందించిన తెలుగుదేశం పార్టీ నాయకులకు గ్రామస్తులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.
ప్రజల అవసరాలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ సేవా కార్యక్రమాల్లో ముందుండే ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ నాయకత్వాన్ని గ్రామస్తులు అభినందించారు

## వైసీపీ నేతల మెలోడ్రామా ప్రజలకు వినోదం, టజీ భరత్‌పై ఆరోపణలు పూర్తిగా అవాస్తవం
## జిల్లా టీడీపీ అధ్యక్షురాలు గుడిసె ఆది కృష్ణమ్మ ఫైర్



కర్నూలు, మే 15 (అనంత ప్రభ)
కర్నూలు నగరంలో వైసీపీ నేతలు నిర్వహించిన ధర్నా, ఆరోపణలు ప్రజలకు వినోదంగా మారాయని కర్నూలు పార్లమెంట్ తెలుగు దేశం పార్టీ అధ్యక్షురాలు గుడిసె ఆది కృష్ణమ్మ ఎద్దేవా చేశారు. మంత్రి టజీ భరత్పై వైసీపీ నేతలు చేసిన అవినీతి ఆరోపణలను ఆమె తీవ్రంగా ఖండించారు. కర్నూలులోని జిల్లా టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రజల కోసం నిబద్ధతతో పనిచేస్తున్న టజీ భరత్‌పై నిరాధార ఆరోపణలు చేయడం వైసీపీ నాయకుల అసహనానికి నిదర్శనమన్నారు. ఆకాశంపై ఉమ్మివేస్తే అది తిరిగి మనపైనే పడినట్టే వైసీపీ నేతల పరిస్థితి మారిందని వ్యాఖ్యానించారు. వైసీపీ జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి చేసిన వ్యాఖ్యలు రాజకీయ కక్షసాధింపేనని పేర్కొన్నారు. “ఆడుదాం ఆంధ్ర” కార్యక్రమంలో జరిగిన అవినీతి ఆరోపణలతో ఇప్పటికే సిద్ధార్థ రెడ్డి ప్రజల్లో విశ్వాసం కోల్పోయారని, ఇప్పుడు టజీ భరత్‌పై విమర్శలు చేయడం హాస్యాస్పదమని విమర్శించారు. ఒకవైపు ఎంపీగా డాక్టర్ బైరెడ్డి శబరి దేశవ్యాప్తంగా మంచి పేరు తెచ్చుకుంటుండగా, అదే ఇంటి పేరు చెప్పుకునే సిద్ధార్థ రెడ్డి మాత్రం వివాదాలు, కేసులతో ప్రజల్లో అపఖ్యాతి తెచ్చుకున్నారని అన్నారు. వైసీపీ పాలనలో అవినీతి, అక్రమాలు, మాఫియాలకు ప్రోత్సాహం లభించిందని ఆరోపించారు. మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి అధికారాన్ని కోల్పోయిన తర్వాత అసహనంతో టీడీపీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్లపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తోందని తెలిపారు. టీడీపీ లీగల్ సెల్ నాయకులు మాట్లాడుతూ టజీ భరత్‌పై చేసిన ఆరోపణలను నిరూపించలేకపోతే సిద్ధార్థ రెడ్డి ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేకపోతే పరువు నష్టం దావా వేయనున్నట్లు హెచ్చరించారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు నాగరాజు యాదవ్, శెట్టి వెంకటేశ్వర్లు, ఆగిపోగ

## ఉదిరిపికొండ తండా కు తాగునీరు సరఫరా చేయలేరా..?



కూడేరు, మే 15 (అనంత ప్రభ)
ఉరవకొండ నియోజకవర్గం కూడేరు మండలం ఉదిరిపికొండ తండాలో ఎండాకాలం తాగు నీరు లేకా చాలా ఇబ్బంది పడుతున్నారు. రెండు సంవత్సరాలుగా నుంచి తాగునీటి కోసం దాదాపుగా ఒకటిన్నర కిలోమీటర్ నుంచి తాగునీటిని తీసుకురావాల్సి వస్తుందిని పంచాయతీ బోరు నుండి ప్రధాన ట్యాంకు వెళ్లే మెయిన్ పైపులైను కు అక్రమ కనెక్షన్లు వేసుకోవడం వల్ల ట్యాంకుకు నీరు చేరకపోవడంతో తాగునీరు సరఫరా కాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పరిస్థితి ఇలా ఉంటే ఆర్డబ్ల్యూఎస్ అధికారులు కానీ పంచాయతీ అధికారులు కానీ, ప్రజలు తాగునీటి కష్టాలు అస్సలు పట్టడం లేదని ఉదిరిపికొండ తాండ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు, కావున జిల్లా ఉన్నత అధికారులు వెంటనే స్పందించి ఉదిరిపికొండ తండాకు తాగు నీరు ఇవ్వాలని లేనిపక్షంలో సోమవారం కలెక్టర్ ఆఫీస్ దగ్గర పెద్ద ఎత్తున ధర్నా నిర్వహిస్తామని స్థానిక ప్రజలు తెలియజేశారు

## రేపే ప్రజావేదికలో మినీమహానాడు




కళ్యాణదుర్గం, మే 15 (అనంత ప్రభ)
తెలుగుదేశం పార్టీ కుటుంబ పసుపు పండుగ మహానాడు సందర్భంగా మన నియోజకవర్గంలో ప్రజావేదిక నందు రేపటి రోజు 16.05.2026న మధ్యాహ్నం 03.30 గంటలకు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు గారి ఆధ్వర్యంలో ఘనంగా మినిమహానాడు నిర్వహించనున్నారు. నియోజకవర్గంలోని తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చెయండి.. కావున కళ్యాణదుర్గం ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులు హాజరై కవరేజ్ చేయవలసినదిగా మనవి..

## ప్రజా సమస్యల పరిష్కారమే బీజేపీ లక్ష్యం



కర్నూలు, మే 15 (అనంత ప్రభ)
భారతీయ జనతా పార్టీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు అక్కమ్మ తోట రామకృష్ణ పరమహంస ఆదేశాల మేరకు శుక్రవారం బుధవారపేటలోని పార్టీ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక అర్జీల స్వీకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షులు ముఖ్య అతిథిగా హాజరై ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించిన అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం సాధించేందుకు భారతీయ జనతా పార్టీ ఎల్లప్పుడూ కట్టుబడి పనిచేస్తోందన్నారు. ప్రజలకు న్యాయం జరిగే వరకు పార్టీ తరఫున నిరంతరం పోరాటం కొనసాగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జనత వారధి కో-కన్వీనర్ ఏ. వెంకట సుజాత, కో-కన్వీనర్ మద్దిలేటి యాదవ్, సీనియర్ నాయకులు, బీజేవైఎం నాయకులు, మహిళా మోర్చా ప్రతినిధులు, మహిళలు మరియు పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

## గ్రామీణ క్రీడలకు ప్రోత్సాహమే లక్ష్యం



ఆదోని, మే 15 (అనంత ప్రభ)
ఆదోని పట్టణంలోని అరుణ్ జ్యోతి నగర్ సమీపంలో ఫిలిప్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కబడ్డీ సమ్మర్ ట్రైనింగ్ సెంటర్ మరియు కబడ్డీ కోర్టును టిడిపి యువ నాయకుడు కొంకా సిద్ధార్థ నాయుడు ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత క్రీడల వైపు ముందుకు రావాలని, కబడ్డీ వంటి గ్రామీణ క్రీడలను ప్రోత్సహించడం ఎంతో అవసరమని తెలిపారు. ఉచితంగా నిర్వహిస్తున్న ఈ ట్రైనింగ్ సెంటర్ ద్వారా యువకులకు మెరుగైన శిక్షణ అందించనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక యువత, క్రీడాభిమానులు, పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు. కబడ్డీ సమ్మర్ క్యాంపు నిర్వహకులు అమర్ ప్రకాష్, భూపతి, నాగరాజ్, తాయన్న, నారాయణ, ఈరన్న, రాము, గోవిందు, వెంకటేష్ పాల్గొన్నారు



AP 4PG 16- 5- 2026 SATURDAYqxp_Layout 1 15-05-2026 09:20 PM Page 3












## ఈ సమ్మర్ డ్రింక్‌తో చాలా సమస్యలు దూరం..





కొన్ని ఆయుర్వేద మొక్కలు, మొక్కల మూలాల్లో ఎక్కువగా ఖనిజాలు ఉంటాయి. అందుకే ఇవి ఆరోగ్యానికి చాలా మంచిది. ఈ నేపథ్యంలోనే వట్టివేరుని సమ్మర్‌లో వాడడం చాలా మంచిదని చెబుతున్నారు నిపుణులు. ఈ వేర్లలో ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి. దీంతో దీనిని ఎక్కువగా ఔషదాలలో వాడతారని డాక్టర్ మిహిర్ ఖత్రి చెబుతున్నారు.

వట్టివేరు ఎలా వాడతారంటే..

వట్టివేరు.. దీనిని ఓ రకమైన సుగంధ గడ్డి. ఇది ఇండియాలో కొన్ని ప్రాంతాల్లో, ఆసియా దేశాల్లో సాగు చేస్తారు. ఈ హెర్బ్ ఔషధ ప్రయోజనాల కోసం, సుగంధ ద్రవ్యాలు, సౌందర్య సాధానాలలో వాడతారు. అయితే, దీనిని వాడడం వల్ల ఎండ వేడి నుంచి ఉపశమనం కూడా లభిస్తుంది. కాబట్టి, దీనిని షర్బత్‌లలో వేసుకుని తాగుతారు.

లాభాలు..

ఈ వట్టివేరుని వాడడం వల్ల కడుపు నొప్పి, మలబద్ధకం, తలనొప్పికి తగ్గుతుంది. ఈ వట్టివేరుని వాడడం వల్ల నాడీ వ్యవస్థ శాంతంగా మారి బ్రెయిన్‌కి రక్త ప్రసరణ మెరుగ్గా మారుతుంది. అంతేకాకుండా, ఈ వట్టివేరు సారం బాడీని శాంతపరిచి, ఒత్తిడిని తగ్గిస్తుంది. నిద్రలేమిని దూరం చేసి జీర్ణ సమస్యలని దూరం చేస్తుంది..



తలనొప్పికి మందులా..

ఎండాకాలంలో చాలా మందికి విపరీతమైన తలనొప్పి వస్తుంది. దీంతో ఈ వేర్లని నీటిలో నానబెట్టి ఆ నీటిని తాగొచ్చు. ఆ వేర్లని మెత్తని పేస్టులా నూరి దానిని తలపై పట్టిలా వేసుకుని కాసేపయ్యాక క్లీన్ చేయండి. తలనొప్పి తగ్గిపోతుంది.

హైడ్రేట్ కోసం..

ఎండాకాలంలో ఎంత నీరు తాగితే అంత మంచిది. అదే విధంగా శరీరాన్ని చల్లబరిచే పదార్థాలు తీసుకోవాలి. ఇందులో భాగంగా వట్టి వేర్లని ఓ గ్లాసులో వేసి ఓ నాలుగైదు గంటలు నానబెట్టి లేదా రాత్రంతా నానబెట్టి ఉదయాన్నే తాగాలి. దీని వల్ల డీహైడ్రేషన్ సమస్య దూ-రమవుతుంది.

కుండలో నీటిలో..

అదే విధంగా.. మీరు కుండని వాడుతుంటే అందులో ఈ వట్టివేరుని ఓ తెల్లని వస్త్రంలో మూటలో కటి ఆ నీటిలో వేయండి. ఈ నీర్నుని తాగుతుండండి. రెండు, మూడ్రోజులకి ఓ సారి ఈ వట్టివేరుని మార్చండి. ఇలా నానిన వట్టివేరుని పారేయాల్సిన అవసరంలేదు. దీని వల్ల అందానికి మేలు కలుగుతుంది. ఎలా అంటే..

అందం కోసం..

నీటిలో నానబెట్టిన వట్టివేర్లని పారేయకుండా దానిని మెత్తగా నూరాలి. దీనిని ప్యాక్‌లా అయ్యాక ముఖానికి వేయాలి. దీంతో ముఖంపై ఉన్న మచ్చలు, మొటిమలు దూరమై ముఖం అందంగా మారుతుంది.

చెమట వాసన దూరం..


ఈ ఎండాకాలంలో చెమట ఎక్కువగా పడుతుంది. అలాంటప్పుడు ఈ వట్టివేరు చెమటని కూడా దూరం చేస్తుంది. అలాంటప్పుడు వట్టివేర్లని నీటిలో వేసి మరిగించి స్నానానికి వాడే నీటిలోకలిపి స్నానం చేయండి. దీంతో సమస్య దూరం.

ఇమ్యూనిటీ..

ఎన్నో యాంటీ ఆక్సిడెంట్స్ ఉన్న ఈ వట్టివేరుని ఇమ్యూనిటీని పెంచుతుంది. అందుకే, ఇమ్యూనిటీ పెరగాలంటే ఈ వట్టివేరని తీసుకోవడం మంచిది.

## థైరాయిడ్ పేషెంట్స్.. వేసవి కాలంలో ఈ పండ్లు తింటే మంచిది..!





ఎండాకాలం మొదలైంది. సీజనల్ మార్పుల కారణంగా.. థైరాయిడ్ పేషెంట్స్ లక్షణాలు తీవ్రం అవుతాయి. వేసవిలో సహజంగా డీహైడ్రేషన్ ఎక్కువగా ఉంటుంది. థైరాయిడ్ సమస్యతో బాధపడేవారిలో వేసవిలో అలసట, నిస్సత్తువ, డీహైడేషన్ వంటి సమస్యలు వేధిస్తూ ఉంటాయి. వేసవి కాలంలో థైరాయిడ్ స్థాయిలను కంట్రోల్‌లో ఉంచుకోవడానికి, మీ శరీరాన్ని హైడ్రేట్‌గా ఉంచడానికి తీసుకోవలసిన పండ్లు ఏమిటో ఈ స్టోరీలో చూద్దాం.

పైనాపిల్..

పైనాపిల్‌లో విటమిన్ బి, సి, మాంగనీస్ వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఈ పండులో ఉండే విటమిన్ బి మీ శరీరానికి శక్తిని అందిస్తుంది. దీనిలోని విటమిన్ సీ యాంటీఆక్సిడెంట్‌గా పనిచేస్తుంది. కాల్షియం శోషణకు, రక్తంలో గ్లూకోజ్ స్థాయిలను నిర్వహించడానికి, నరాల పనితీరును మెరుగుపరచడానికి మాంగనీస్ కీలక పాత్ర పోషిస్తుంది. థైరాయిడ్ పేషెంట్స్‌కు బలహీనత, అలసట సాధారణం. విటమిన్ బి అలసటను దూరం చేస్తుంది. పైనాపిల్‌లో ఇన్‌ఫ్లమేటరీ గుణాలు ఉంటాయి. ఇవి థైరాయిడ్ లక్షణాలు తగ్గించడంలో సహాయపడతాయి. పైనాపిల్‌ను ఉదయం ఖాళీ కడుపుతో తినవచ్చు. ఇది ప్రొటీన్లను విచ్ఛిన్నం చేస్తుంది, జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. భోజనం తర్వతా పైనాపిల్ తినవద్దు, భోజనానికి అరగంట ముందు తీసుకోవచ్చు.

100 గ్రాముల పైనాపిల్‌లో ఈ పోషకాలు ఉంటాయి..
కేలరీలు: 82 కిలో కేలరీలు, డైటరీ ఫైబర్: 2.3 గ్రా, కొవ్వు: 0.20 గ్రా, ప్రోటీన్: 0.89 గ్రా
పొటాషియం: 109 మి.గ్రా,కార్బోహైడ్రేట్లు: 13 గ్రా, విటమిన్ బి: 5%, విటమిన్ సి: 79%

ఆరెంజ్..

ఆరెంజ్‌లో విటమిన్ సీ మెండుగా ఉంటుంది. హైపోథైరాయిడిజంతో బాధపడేవారు.. ఆరెంజ్ ఎక్కువగా తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. విటమిన్ సీ రోగనిరోధక వ్యవస్థను బలపరు-స్తుంది. శరీరంలో ఒత్తిడి హార్మోన్ స్థాయిలను నియంత్రిస్తుంది. ఆందోళన, రక్తపోటు, డిప్రెషన్ వంటి సమస్యలను నివారిస్తుంది. మీ సలాడ్‌లో ఆరెంజ్ తీసుకోవచ్చు. ఆరెంజ్‌ను భోజనం తర్వాత.. అల్పాహారంగా తీసుకోవచ్చు.

100 గ్రాముల ఆరెంజ్‌లో ఈ పోషకాలు ఉంటాయి..
కేలరీలు - 147 కిలో కేలరీలు
ఫైబర్: 3 గ్రా, ప్రోటీన్: 1 గ్రా, చక్కెర: 12 గ్రా, విటమిన్ ఎ: 1%, విటమిన్ సి: 64%
కాల్షియం: 6.4 మి.గ్రా, పొటాషియం: 181 మి.గ్రా, నీరు: 84%, బెర్రీస్..,బెర్రీస్..

బ్లూ బెర్రీస్.. థైరాయిడ్ హార్మోన్ ఉత్పత్తిని ప్రేరేపిస్తుంది. బెర్రీస్‌లో యాంటీఆక్సిడెంట్లు, విటమిన్లు మెండుగా ఉంటాయి. ఇందులో ఉండే ఫ్లేవనాయిడ్ కంటెంట్ సమృద్ధిగా ఉంటాయి. ఇది మెదడులోని ప్రోటీన్లు, ఎంజైమ్‌ల ఉత్పత్తి ప్రోత్సహించి, మెదడు పనితీరును మెరుగుపరుస్తుంది. బెర్రీస్‌లో ఎల్లాజిక్ యాసిడ్ ఉంటుంది. ఇది యాంటీఆక్సిడెంట్‌గా పనిచేసి, క్యాన్సర్ కణాలను నియంత్రిస్తుంది. దీనిలోని యాంటీఇన్ఫ్లమేటరీ గుణాలు.. థైరాయిడ్ పేషెంట్స్‌కు మేలు చేస్తాయి. థైరాయిడ్ డిజార్డర్ ప్రమాదాన్ని నివారిస్తుంది. థైరాయిడ్ ఉన్నవారు లంచ్ , డిన్నర్‌లో కొన్ని బెర్రీలను తీసుకోవచ్చు. స్నాక్స్‌గా కూడా తినవచ్చు.

## కూల్ వాటర్ తాగితే పిల్లలు పుట్టరా..



సమ్మర్‌లో చాలా మంది చల్లని నీరు తాగుతుంటారు. కొంతమంది అయితే, ఏ కాలమైనా చల్లని నీటినే తీసుకుంటారు. దీని వల్ల ఆరోగ్యంపై ఎఫెక్ట్ పడుతుందని చెబుతున్నారు. మరీ ముఖ్యంగా మగవారు ఎక్కువగా చల్లని నీరు తాగితే ఇన్‌ఫెర్టిలిటీ సమస్య వస్తుందని చెబుతున్నారు

కారణం..

సాధారణంగా నీరు తాగితే మంచిదే. కానీ, ఎక్కువగా చల్లని నీరు తాగడం వల్ల బలహీనమైన స్పెర్మ్ వస్తుందని. దీంతో ఇన్‌ఫెర్టిలిటీ సమస్య ఉంటుందని చెబుతున్నారు నిపుణులు. అందుకే ఈ విషయంలో జాగ్రత్తలు అవ-సరమని చెబుతున్నారు.

ఐస్ వాటర్ తాగితే..

సాధారణంగా ఎక్కువగా కూల్ వాటర్ తాగితే సాధారణంగానే శరీర ఉష్ణోగ్రత తగ్గుతుంది. ఇలా చాలా చల్లగా ఉన్నప్పుడు, స్క్రోటమ్‌లో స్పెర్మ్ ఉత్పత్తి తగ్గి బలహీనమైన స్పెర్మ్ రిలీజ్ అయ్యే అవకాశం ఉంది.

స్క్రోటమ్..

సరైన స్మెర్మ్ రిలీజ్ కోసం స్క్రోటమ్ టెంపరేచర్ బాడీలోని మిగిలిన ఉష్ణోగ్రత కంటే కాస్తా తక్కువగ ఉండాలి. కానీ, ఎక్కువగా చల్లని నీరు తాగితే అది ఓవర్ కూలింగ్ అయి స్క్రోటమ్‌కి రక్తప్రసరణ అవ్వదు. దీంతో స్పెర్మ్ అంత నాణ్యతగా ఉండదు. పైగా తక్కువగా రిలీజ్ అవుతుంది.

రక్తనాళాల సంకోచం

ఎక్కువగా చల్లని నీరు తాగితే వాసోకాన్‌స్ట్రిక్షన్ సమస్యలు వసా-యి. స్క్రోటమ్‌లోని రక్తనాళాలు ఇరుకుగా మారతాయి. ఇలా అంుునవ్పుడు జననాంగాలకు రక్తప్రసరణ తగ్గుతుంది. దీంతో అంగస్తంభన, స్పెర్మ్ ఉత్పత్తి లోపం వంటి సమస్యలు వస్తాయి.

ఐస్ వాటర్ తీసుకోవద్దా..

మొత్తానికీ, అసలు కూల్ వాటర్ తాగొద్దా అంటే.. అదేం లేదు అని చెబుతున్నారు నిపుణులు. అప్పుడప్పుడు ఐస్ వాటర్ తాగడం వల్ల ఎలాంటి ఇబ్బంది ఉండదు. అదే పనిగా ప్రతిసారి కూల్ వాటర్ తాగితే మాత్రం ఈ సమస్యలు వచ్చే అవకాశం ఉంది. కాబట్టి, ఈ విషయంలో మగవారు కచ్చితంగా జాగ్రత్తలు తీసుకోవాలని చెబుతున్నారు.

## ఇలా స్వీట్ నిమ్మ పొడిని రెడీ చేస్తే, ఇనిస్టెంట్‌గా నిమ్మరసం ఎప్పుడు కావాలంటే అప్పుడు తాగొచ్చు

అప్పుడు తాగొచ్చు

వేసవిలో మండే ఎండల్లో ఇంటికి రాగానే చల్లని పానీయాన్ని తాగాలనిపిస్తుంది. ఎండల్లో తిరగడం వల్ల చెమట ద్వారా సోడియం బయటకు పోతుంది. దీనివల్ల డిహైడ్రేషన్ బారిన పడే అవకాశం ఉంది. కాబట్టి ఇంట్లోకి రాగానే చక్కెర, ఉప్పు కలిపిన నిమ్మరసాన్ని తాగడం వల్ల చాలా ఉపయోగం ఉంది. అయితే నిమ్మకాయ కోసి, పిండి, నీళ్లలో కలిపి, పంచదార, ఉప్పు కలిపి ఈ రసాన్ని తయారు చేస్తారు. రోజు నిమ్మకాయ కోయాల్సిన అవసరం లేకుండా నిమ్మ పొడిని తయారు చేసుకుంటే సరి. తాగాలనిపించినప్పుడు గ్లాసు నీటిలో రెండు చెంచాల పొడి కలుపుకుని తాగితే తాజా నిమ్మరసం తాగిన ఫీలింగ్ వస్తుంది. ఇలా చేయడం వల్ల పని కూడా సులభతరం అవుతుంది. ఇనిస్టెంట్ నిమ్మరసం కోసం నిమ్మ పొడిని ఎలా తయారు చేయాలో చూద్దాం.

1. ముందుగా నిమ్మకాయలను కోసి రసం తీసి పెట్టుకోవాలి.
2. మిక్సీలో పంచదార వేసి మెత్తని పొడిలా చేసుకోవాలి.
3. పెద్ద ట్రే పై ఈ పంచదార పొడిని కాస్త ఉప్పును, నిమ్మ రసాన్ని చల్లుకొని, ఆ మిశ్రమాన్ని చేతులతో బాగా కలపాలి.
4. ఆ ట్రేపై ఒకే చోట కుప్పలా కాకుండా ఈ పొడిని ఎండబెట్టడానికి వీలుగా ట్రే అంతా విస్తరించేలా చేయాలి.
5. దీన్ని ఎండలో నాలుగైదు రోజులు ఎండబెట్టాలి. దుమ్ము ధూళి పడకుండా పైన ఏదైనా కవర్ చేయడం మంచిది.
6. నాలుగైదు రోజుల్లో అది పొడిలా మారిపోతుంది. దీన్ని గాలి చొరబడని డబ్బాలో వేసి ఉంచుకోవాలి.
7. ఇది మూడు నాలుగు నెలల వరకు నిల్వ ఉంటుంది.

ఎండలో నుంచి ఇంటికి వచ్చాక చల్లని నీళ్లలో ఈ పొడిని వేసుకుని తాగితే డీహైడ్రేషన్ బారిన పడకుండా ఉంటారు.





నిమ్మరసం తాగితే...

నిమ్మకాయల్లో విటమిన్ సి పుష్కలంగా ఉంటుందని అందరికీ తెలుసు. ఇది శరీర రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. శరీరంలోని కణాలను నాశనం చేసే ఫ్రీ రాడికల్స్ నుంచి ఇది మనల్ని కాపాడుతుంది. అజీర్తితో బాధపడే వారికి కూడా నిమ్మరసం ఎంతో మేలు చేస్తుంది. మీ శరీరం పోషకాలను శోషించుకునేలా చేస్తుంది. పేగు కదలికలను మెరుగుపరిచి కడుపు ఉబ్బరం, మలబద్ధకం వంటి సమస్యలు రాకుండా అడ్డుకుంటుంది. నిమ్మరసం తాగడం వల్ల ముఖంపై మొటిమలు వచ్చే అవకాశం తగ్గుతుంది. కాఫీ, టీలు తాగే బదులుగా నిమ్మరసం తాగడం ఆరోగ్యానికి ఎంతో మంచిది. అధిక బరువుతో బాధపడే వారి సంఖ్య పెరిగిపోతోంది. రోజును పరగడుపున గ్లాసు నిమ్మరసంతో ప్రారంభించడం వల్ల బరువు పెరిగే అవకాశం తగ్గుతుంది. బరువును తగ్గించడంలో ఇది నేచురల్ రెమెడీగా పనిచేస్తుంది. వికారం, వాంతులు వంటి సమస్యలను కూడా తగ్గించడానికి నిమ్మరసం సాయం చేస్తుంది. ఇందులో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి మనల్ని హానికారక వైరస్‌ల నుంచి కాపాడుతాయి. ముఖంపై ముడతలు, గీతలు వంటివి త్వరగా రాకుండా ఉండాలన్న రోజూ నిమ్మరసం తాగాలి.

# 250 ఏళ్ల కంపెనీకి బ్రాండ్ అంబాసిడర్‌గా శ్రీలీల.. రెమ్యునరేషన్ ఎన్ని కోట్లంటే?





కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన మైసూర్ శాండల్ సోప్‌కు స్టార్ హీరోయిన్ తమన్నా భాటియాను బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించడంపై కన్నడ సీమ రగిలిపోతోన్న సంగతి తెలిసిందే. దాదాపు 6.2 కోట్ల పారితోషికంతో తమన్నాకు ఈ బాధ్యతను కట్టబెట్టింది సిద్ధరామయ్య ప్రభుత్వం. అయితే కర్ణాటకలో ఎంతో మంది ప్రముఖులు, ప్రతిభావంతులు ఉండగా పరాయి రాష్ట్రానికి చెందిన నటిని మైసూర్ శాండల్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించడం వివాదానికి దారి తీసింది. కర్ణాటక సంఘాలు, పార్టీలు, ప్రముఖులు ప్రభుత్వ తీరును తప్పుబడుతున్నారు. ఈ క్రమంలో కర్ణాటకకి చెందిన యువ కథానాయిక శ్రీలీల అదిరిపోయే ఆఫర్ అందుకున్నారు. ఈ వివరాల్లోకి వెళితే..

చేతినిండా సినిమాలతో శ్రీలీల బిజీ ప్రస్తుతం టాలీవుడ్‌లో బిజీగా ఉన్న హీరోయిన్ ఎవరంటే ఖచ్చితంగా వినిపించే పేరు శ్రీలీల. ధమాకాతో లైమ్ లైట్‌లోకి వచ్చిన ఈ ముద్దగుమ్మ ఆ తర్వాత భగవంత్ కేసరి, గుంటూరు కారం వంటి భారీ బడ్జెట్ సినిమాల్లో అవకాశాలు దక్కించుకుంది. ఇక పుష్ప 2లో కిస్సిక్ సాంగ్‌తో దేశాన్ని ఊపేసి నేషనల్ వైడ్ పాపులర్ అయ్యింది. అందం, అభినయం, డ్యాన్స్‌తో క్రేజీ ఆఫర్లు పట్టేస్తోంది. చాలా చిన్న వయసులోనే బాలీవుడ్ ఆఫర్ కూడా అందుకోవడంతో శ్రీలీల అదృష్టంపై సీనియర్ హీరోయిన్లు, అప్ కమింగ్ హీరోయిన్లు అసూయ పడుతున్నారు. ఏళ్లుగా నిరీక్షిస్తున్న తమ వల్ల కానిది శ్రీలీల ఈజీగా సాధిస్తోందని కుళ్లుకుంటున్నారు.

ఆషికి 3తో బాలీవుడ్‌లోకి బాలీవుడ్ స్టార్ హీరో కార్తీక్ ఆర్యన్ సరసన ఆషికి 3 అనే సినిమా ద్వారా బాలీవుడ్‌లో అడుగుపెడుతున్నారు శ్రీలీల. అనురాగ్ బసు ఈ చిత్రానికి దర్శకుడు. దీపావళి కానుకగా ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ భావిస్తున్నారు. దీనిలో భాగంగా శరవేగంగా సినిమాను పరుగులు పెట్టిస్తున్నాడు అనురాగ్. అయితే అషికి 3 ఇంకా సెట్స్ మీద ఉండగానే శ్రీలీల హిందీలో మరో ఆఫర్ అందుకున్నట్లుగా వార్తలు వస్తున్నాయి. మరో స్టార్ హీరో సిద్ధార్థ్ మల్హోత్రా సరసన శ్రీలీల ఆడిపడనుందట. ఆనంద్ ఎల్ రాయ్ ఈ సినిమాను నిర్మిస్తుండగా.. రాజ్ సాండియాలా దర్శకత్వం వహిస్తారని బీటౌన్ టాక్. అయితే దీనిపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. ఇక తెలుగులో జూనియర్, మాస్ జాతర, లెనిన్, తమిళంలో పరాశక్తి సినిమాలలో శ్రీలీల నటిస్తున్నారు.

టాప్ బ్రాండ్స్‌కు అంబాసిడర్‌గా సినిమా హిట్, ఫ్లాపులతో సంబంధం లేకుండా శ్రీలీల వరుస అవకాశాలు అందుకుంటున్నారు. ఇక బ్రాండ్ అండార్స్‌మెంట్స్‌తోనూ ఈ ముద్దుగుమ్మ భారీగా సంపాదిస్తోందట. న్యూడ్ స్కిన్ కేర్, అమృత గ్రూప్, ప్రెస్టా వుమెన్స్ వేర్, నీరూస్ తదితర బ్రాండ్స్‌కు శ్రీలీల అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్నారు. తాజాగా శ్రీలీల అండార్స్‌మెంట్స్ కెరీర్‌లోనే మైల్ స్టోన్ అనదగ్గ ఆఫర్ వచ్చింది.

శ్రీలీలతో యూకే కంపెనీ డీల్ పర్సనల్ కేర్, కాస్మోటిక్స్, ఫ్రాగ్‌రెన్సెస్ విభాగంలో ప్రపంచంలోని అగ్రగామి సంస్థల్లో ఒకటైన యార్డ్లే లండన్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా ఎంపికయ్యారు. లండన్ కేంద్రంగా పనిచేస్తున్న ఈ కంపెనీకి దాదాపు 255 ఏళ్ల చరిత్ర ఉండగా.. ప్రపంచంలోని అత్యంత పురాతన కంపెనీల్లో ఒకటిగా యార్డ్లేకు పేరుంది. 2009లో యార్డ్లేను భారత కార్పోరేట్ దిగ్గజం విప్రో ఎంటర్‌ప్రైజెస్ కొనుగోలు చేసింది. ఇంతటి చరిత్ర కలిగిన ఈ సంస్థలోని ఫ్రాగ్‌రెన్సెస్ విభాగానికి గాను భారత్‌లో శ్రీలీల ప్రమోట్ చేయనుండటం విశేషం.

పారితోషికం ఎంతంటే? అయితే ఇందుకు గాను శ్రీలీల ఎంత మొత్తంలో పారితోషికం అందుకుంటున్నారన్నది తెలియరాలేదు. ప్రస్తుతం బ్రాండ్ ప్రమోషనింగ్ కోసం రూ.50 లక్షల నుంచి రూ.75 లక్షల మధ్య శ్రీలీల ఛార్జ్ చేస్తుండటంతో ఇది కూడా అదే స్థాయిలో లేదా ఆపైనా ఉండే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. యార్డ్లే నుంచి శ్రీలీల పారితోషికంగా ఎంత మొత్తం వసూలు చేస్తున్నారనే దానిపై త్వరలోనే మరిన్ని వివరాలు తెలిసే అవకాశం ఉంది.




# చిరంజీవికి అలా.. బాలయ్యకు ఇలానా? అల్లు అరవింద్‌నే అడగండి..



మెగా ఫ్యామిలీ, అల్లు కుటుంబానికి మధ్య విభేదాలు తారాస్థాయికి చేరుకొన్నాయనే విషయాల గురించి మీడియాలో ఎక్కువగా చర్చ జరుగుతున్నది. ఈ రెండు కుటుంబాలు నర్మగర్భంగా మాట్లాడే తీరు ఆ వివాదాస్పద అంశానికి బలం చేకూరేలా కనిపిస్తుంటుంది. అయితే సాధారణ ప్రజలకు ఆ కుటుంబాల మధ్య గతంలో ఉన్న సఖ్యత, బంధాలు లేవనే అపోహ మాత్రం ఏర్పడింది. అయితే ఈ విషయాలపై రెండు కుటుంబాలకు ఆప్తుడైన తండేల్ నిర్మాత బన్నీ వాసు వెల్లడించిన వివరాల్లోకి వెళితే..

ఇటీవల కాలంలో అల్లు ఫ్యామిలీకి నందమూరి బాలకృష్ణ అత్యంత చేర-ువైనట్టు బయట వాళ్లకే కాకుండా సినిమా వర్గాలకు అనిపిస్తుంది. అయితే ఈ క్రమంలో బాలయ్యకు పద్మభూషణ్ అవార్డు రావడంపై అన్ని వర్గాల నుంచి స్పందన వ్యక్తమైంది. అయితే సినీ పరిశ్రమ ఈ సందర్భాన్ని పు-రస్కరించుకొని భారీ సమావేశాన్ని ఏర్పాటు చేసి.. ఆయనకు సన్మానం చేయాలనే ఆలోచనలో సినిమా పరిశ్రమ ఉందనే వార్త ఫిలిం నగర్‌లో చక్కర్లు కొడుతున్నది.


అయితే బన్నీ వాసును ఈ విషయంపై మెగాస్టార్ చిరంజీవికి పద్మభూషణ్ వస్తే ఎలాంటి సన్మానం చేయలేదు. మెగా హీరోలు, మెగా కుటుంబం పెద్దది అనే ఫీలింగ్ ఇండస్ట్రీలో ఉంది. ఆ సన్మాన కార్యక్రమాన్ని ఎందుకు నిర్వహించలేదని మీడియా అడిగిన ఓ ప్రశ్నకు ఆయన సరైన రీతిలో స్పందించారు.

పద్మ భూషణ్ అవార్డు అందుకొన్నందుకు చిరంజీవికి సన్మానం చేయకపోవడం.. బాలకృష్ణకు చేయాలనే ప్లాన్ చేయడం లాంటి విషయాలను అరవింద్ గారి లాంటి పెద్ద వాళ్లను అడిగితే బాగుంటుంది. అది చాలా పెద్ద విషయం. నా వయసుకు, నా స్థాయికి మాట్లాడే విషయం కాదు. అరవింద్ గారినే అడిగితే మంచింది. ఈ పరిస్థితుల్లో నేను ఏం మాట్లాడినా బాగుండదు. ఆ విషయం గురించి నేను మాట్లాడితే కరెక్ట్ కాదు అంటూ బన్నీ వాసు తప్పించుకొన్నారు.

నంద్యాల వివాదం తర్వాత నాకు, పవన్ కల్యాణ్‌కు మధ్య గ్యాప్ వచ్చిందనే విషయం సరికాదు. అందులో వాస్తవం లేదు. పవన్ కల్యాణ్ మెచ్యూరిటీ లెవెల్స్ వేరేగా ఉంటాయి. ఆయన ఇలాంటి విషయాలను మనసులో పెట్టుకోని చూడరు. ఎవరు ఏం చేస్తున్నారు? ఎవరు ఎలాంటి వారు? అనేది ఆయనకు ఫుల్లుగా క్లారిటీ ఉంది. నా విషయంలో ఆయన బన్నీతో కలిపి చూడరు.పార్టీకి ఏం చేస్తున్నాను? పార్టీ కోసం ఎలా ఉ ంటున్నారనేది ఆయన చూస్తారు అని బన్నీ వాసు వివరణ ఇచ్చారు.

# మహేష్ బాబు వదిలేసిన 1800 కోట్ల సినిమా.. థియేటర్లు బద్ధలయ్యేవి.. ఆ మూవీ ఏంటంటే?





సూపర్ స్టార్ మహేష్ బాబు ప్రస్తుతం ఇండియాస్ బిగ్గెస్ట్ డైరెక్టర్ ఎస్ఎస్ రాజమౌళి దర్శకత్వంలో నటిస్తున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం హైదరాబాద్ లోనే మూడవ షెడ్యూల్ జరుగుతోంది. చిత్రీకరణ విషయంలో మాత్రం జక్కన్న ఎస్. ఎస్. ఎం.బి 29 సినిమాను శరవేగంగా కొనసాగిస్తున్నారు. బాలీవుడ్ స్టార్ బ్యూటీ ప్రియాంక చోప్రా హీరోయిన్ గా నటిస్తున్న విషయం తెలిసిందే. మలయాళం సూపర్ స్టార్ పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రలో నటిస-్తున్నారని తెలుస్తోంది. ఇదిలా ఉంటే మహేష్ బాబు చివరిగా గుంటూరు కారం చిత్రంతో ప్రేక్షకులను అలరించిన సంగతి తెలిసిందే. అది సూపర్ స్టార్ మహేష్ బాబు ఇప్పటివరకు రెగ్యులర్ క్యారెక్టర్లలోనే నటిస్తూ వచ్చారు. కానీ అభిమానులు మాత్రం ఆయనను పవర్ఫుల్ రోల్స్ లో చూడాలని ఎంతగానో ఆశిస్తున్నారు. ఈ క్రమంలోనే మహేష్ బాబు వదిలే-సుకున్న 1870 కోట్ల సినిమా గురించి తాజాగా న్యూస్ బయటకు వచ్చింది. ఆ సినిమా చేసి ఉంటే మాత్రం మహేష్ బాబు ఇండియా ను షేక్ చేసే వారిని సినీ ప్రముఖులు అభిప్రాయపడుతున్నారు.

ఇంతకీ ఆ సినిమా ఏంటో తెలిస్తే అందరూ షాక్ అవ్వాల్సిందే. క్రియేటివ్ డైరెక్టర్ సుకుమార్, ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ కాంబినేషన్లో వచ్చిన పుష్ప చిత్రమే కావడం విశేషం. అయితే ఈ సినిమాకు మొదట హీరోగా మహేష్ బాబు అని అనుకున్నట్టుగా ఇప్పుడు తెలుస్తోంది. కానీ మహేష్ బాబు ఆ సినిమాలు వదులుకోవడంతో అల్లు అర్జున్ వద్దకు వెళ్లిందని ఫిల్మ్ సర్కిల్స్ లో గుసగుసలు నడుస్తున్నాయి. ఇక అల్లు అర్జున్ టెర్రిఫిక్ పెర్ఫార్మెన్స్ తో పుష్ప, పుష్ప 2 చిత్రాలు ఎంతటి సెన్సేషన్ క్రియేట్ చేశాయో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు.

రీసెంట్ గా వచ్చిన పుష్ప 2 చిత్రం ఏకంగా బాక్సాఫీస్ రికార్డులను తిరగరాసింది. 1870 కోట్లు గ్రాస్ కలెక్ట్ చేసి ఇండియాలోనే హైయెస్ట్ గ్రాస్ కలెక్ట్ చేసిన రెండవ సినిమాగా రికార్డు సెట్ చేసింది. బాహుబలి 2 సాధించిన బాక్సాఫీస్ కలెక్షన్లు 1810 కోట్లను దాటేసి మరి ఈ రికార్డును సెట్ చేయడం సెన్సేషన్ గా మారింది. మన వైపు అల్లు అర్జున్ కు పుష్ప పాత్రలో నటించినందుకు ఏకంగా బెస్ట్ యాక్టర్ విభాగంలో నేషనల్ అవార్డు వరించిన సంగతి తెలిసిందే. ఇక నెక్స్ట్ పుష్ప 3 కూడా రాబోతుంది. ఆ పార్ట్ లో విజయ్ దేవరకొండ నటిస్తారని తెలుస్తోంది.

అయితే ఇంతటి సెన్సేషన్ క్రియేట్ చేసిన పుష్ప చిత్రాన్ని మహేష్ బాబు ఎందుకు వదులుకున్నారా అన్నది ఇప్పుడు మిలియన్ డాలర్ క్వశ్చన్ గా మారింది. అయితే పుష్ప చిత్రం ప్రారంభానికి ముందు మహేష్ బాబు ఇంట్లో వరుసగా విషాదాలు నెలకొనడం, గుంటూరు కారం చిత్రం తర్వాత ఎస్ఎస్ రాజమౌళి తో సినిమాకు కమిట్ అవ్వడమే కారణం అని తెలుస్తుంది. ఇక పుష్ప చిత్రమే కాదు, శంభాజీ మహారాజ్ జీవిత కథతో వచ్చిన చావా చిత్రాన్ని కూడా మహేష్ బాబు వదిలేసారంట. ఈ హిస్టారికల్ ఫిలిం లో మహేష్ బాబు నటించిన మాత్రం మరింత బీభత్సం సృష్టించే వారిని ఫ్యాన్స్ అభిప్రాయపడ్డారు. ఇలా తన ముందుకు వచ్చిన రెండు బ్లాక్ బస్టర్ మూవీస్ ను మహేష్ బాబు వదులుకోవడం ఆసక్తికరంగా మారింది. ఎస్. ఎస్. ఎం.బి 29 తో మాత్రం ఇండియన్ బాక్సాఫీస్ రికార్డులను చెల్లాచెదురు చేస్తారని ఫ్యాన్స్ నమ్ముతున్నారు. ఆ ప్రాజెక్టుకు మార్కెట్లోనూ భారీ డిమాండ్ ఉండింది.

# భైరవం మూవీ రివ్యూ అండ్ రేటింగ్

వీపురంలో జమీందార్ వంశానికి చెందిన గజపతి (మనోజ్ మంచు)కి గ్రామంలో పేరు ప్రతిష్టలు ఉన్నప్పటికీ..పేదరికం వెంటాడుతుంటుంది. గజపతికి తన ఊరిలోనే పెద్దరికాన్ని ప్రదర్శించే వరద (నారా రోహిత్), అనాథగా బతికే శ్రీను (బెల్లంకొండ శ్రీను) ప్రాణస్నేహితులుగా ఉ ంటారు. ఇదిలా ఉండగా, ఆ గ్రామంలోని ఆలయ ధర్మకర్తగా గజపతి నానమ్మ (జయసుధ) ఉంటారు. ఆలయ భూములు కాజేయడానికి మంత్రి (శరత్ లోహితస్య) పన్నాగం పన్నుతాడు.

అనాథ అయినప్పటికీ శ్రీనును కన్నబిడ్డగా ప్రజలు ఎందుకు చూస్తారు? శ్రీనుతో వెన్నెల (అదితి శంకర) లవ్ ట్రాక్ ఎలా సాగింది? గజపతిని భార్య నీలిమ (ఆనంది) ఎలా వేధించింది. భార్య ఒత్తిళ్లకు గజపతి తన మనసును ఎలా మార్చుకొన్నాడు. ప్రాణస్నేహితులుగా ఉండే గజపతి, వరద, శ్రీను మధ్య మంత్రి ఎలా చిచ్చు పెట్టారు. వరద స్నేహం కోసం ప్రాణాలిచ్చేంత ప్రేమ ఉన్న గజపతి తన స్నేహితులకు ఎందుకు ఎదురు తిరిగాడు? వరద, గజపతి, శ్రీను మధ్య విభేదాలు ఎలాంటి పరిస్థితులకు దారి తీశాయి? అనే ప్రశ్నలకు సమాధానమే భైరవం సినిమా కథ.

పోలీస్ ఇన్స్‌పెక్టర్ (సంపత్ రాజ్) తన ఉద్యోగానికి రాజీనామాను పై అధికారికి సమర్పించడంతో సినిమా హై నోట్‌లో మొదలవుతుంది. తన రాజీనామాకు కారణం చెప్పడం మొదలు పెట్టడంతో దేవీ పురంలో ముగ్గురు ప్రాణ స్నేహితుల కథను ఎమోషనల్‌గా దర్శకుడు ప్రారంభించాడు. ముగ్గురు హీరోల ఇంట్రడక్షన్, ఎలివేషన్స్‌ను బాగానే డిజైన్ చేశాడు. ఆ తర్వాత శ్రీను ప్రేమ కథ, వరద, గజపతి ఫ్యామిలీ మధ్య ఉండే అన్యోన్యతను, కథను ఎస్టాబ్లిష్ చేయడానికి కాస్త టైమ్ ఎక్కువగా తీసుకొన్నట్టు అనిపిస్తుంది. ఫస్టాఫ్‌ను రెగ్యులర్, రొటీన్ ఫార్మాట్‌తో నడిపించినప్పటికీ.. ఇంటర్వెల్ ముందు పవర్‌ఫుల్ ఎపిసోడ్‌తో తొలిభాగాన్ని ముగించి సెకండాఫ్‌పై ఆసక్తిని పెంచాడు.

అయితే ముగ్గురు హీరోల మధ్య ఎమోషన్స్, బాండింగ్‌ను బలంగా ఎస్టాబ్లిష్ చేయాల్సి ఉన్నప్పటికీ.. ఆ దిశగా ప్రయత్నం సరిగా చేయలేదనే ఫీలింగ్ కలుగుతుంది. భావోద్వేగంతో చెప్పాల్సిన సన్నివేశాల్లో యాక్షన్ నింపడం వల్ల సినిమాలో సోల్ కాస్త మిస్ అయిందనిపిస్తుంది. ఇలాంటి లోపాలు ఉన్నప్పటికీ.. మామిడితోట సీన్ నుంచి మూవీలో సన్నివేశాలు నెక్స్ట్ రేంజ్‌లోకి వెళ్తాయి. క్లైమాక్స్ సన్నివేశాలను చిత్రీకరించిన తీరు విజయ్ కనకమేడల ప్రతిభ ఎంతో తెలుస్తుంది. సెకండాఫ్‌ను ఇంకాస్త బెటర్‌గా డిజైన్ చేయాల్సిందనే ఫీలింగ్ కలుగుతుంది. నటీనటుల ఫెర్ఫార్మెన్స్ విషయానికి వస్తే.. బెల్లంకొండ శ్రీనివాస్ ఈ సినిమాకు బ్యాక్ బోన్‌గా నిలిచాడు. సినిమాలోని ఎమోషనల్ కంటెంట్‌ను తన పాత్ర ద్వారా బాగా ఎలివేట్ చేశాడు. నటుడిగా మరింత మెచ్యూరిటీని చూపించాడు. ప్రీ క్లైమాక్స్ నుంచి క్లైమాక్స్ సన్నివేశాల్లో తనలోని నట విశ్వరూపాన్ని చూపించే ప్రయత్నం చేశాడు. నారా రోహిత్, మనోజ్‌తో పాత్రలతో మమేకమై మంచి బాండింగ్‌ను ఆన్ స్క్రీన్‌పై ఎలివేట్ చేశాడు. ఇక మనోజ్ మంచు నటుడిగా మరో రేంజ్ పెర్ఫార్మెన్స్ చేశాడు. కాస్త విరామం తీసుకొన్నప్పటికీ.. సూపర్ క్యారెక్టర్‌తో రీ ఎంట్రీతో అదరగొట్టాడు. ఇండస్ట్రీలో తన టైమ్ స్టార్ట్ అయిందని గజపతి పాత్ర ద్వారా చాటి చెప్పాడు. నారా రోహిత్ విషయానికి వస్తే.. వరద పాత్రలో హుందాగా కనిపించాడు. తన పాత్రకు ఎంత ఎమోషన్ కావాలి? ఎంత యాక్షన్ కావాలో అంతే సమతుల్యాన్ని పాటించి సటిల్‌గా స్క్రీన్ పై కనిపించాడు. ఇక నాన్నమ్మగా జయసుధ పాత్ర అంతంత మా-త్రమేగానే ఉన్నప్పటికీ.. స్క్రీన్ మీద కనిపించినంత సేపు ఆమె ప్రజెన్స్ బాగుంది. ఈ సినిమా కథను నడిపించే పాత్రలో నీలిమగా ఆనంది నటన బాగుంది. కేవలం గ్లామర్ పరంగానే కాకుండా ఆనంది పాత్రల స్వరూపాన్ని, సినిమా కథ దిశను మార్చే పాత్రలో ఒదిగిపోయింది. ఇక నారా రోహిత్ భార్య పాత్రలో పూర్ణిమగా దివ్య పిళ్లై ఎమోషనల్ కంటెంట్‌ను సినిమాకు అందించే విధంగా పెర్ఫార్మ్ చేశారు. వెన్నెల కిషోర్ కామెడీ పెద్దగా వర్క్ కాలేదు. సంపత్ రాజ్, శరత్, అజయ్, ఇతర పాత్రలు సినిమాలో గుర్తుంచుకొనే పాత్రల్లో కనిపించారు.

టెక్నికల్ అంశాల విషయానికి వస్తే.. ఈ సినిమాకు శ్రీ చరణ్ పాకాల మ్యూజిక్ ప్రధానమైన బలంగా మారింది. బ్యాక్ గ్రౌండ్ స్కోర్‌తోనే కాకుండా హీరోల ఇంట్రడక్షన్ సాంగ్ సంక్రాతి పాట, అలాగే వెన్నెల, గిచ్చు గిచ్చు సాంగ్ ఆడియో పరంగా ఫుల్ జోష్‌ను కలిగిస్తే.. తెర మీద అదే జోష్‌ను చూపించారు. ఇక ఈ సినిమాలో మంచి మాస్ యాక్షన్ ఎపిసోడ్స్ ఉన్నాయి. వాటితో గ్రామంలోని వాతవరణాన్ని హరి కె వేదాంతం చక్కగా, చాలా సహజంగా చిత్రీకరించాడు. కేకే రాధామోహన్ ఈ మూవీని రాజీ లేకుండా మంచి క్వాలిటీతో సినిమాను అందించారు. ప్రొడక్షన్ వాల్యూస్ హై స్టాండర్డ్‌లో ఉన్నాయి. కంటెంట్‌పై మరింత దృష్టిపెట్టి ఉంటే బెస్ట్ మాస్ యాక్షన్ మూవీ అయి ఉండేదనిపిస్తుంది. తమిళంలో సూపర్ హిట్ అయిన గరుడన్ సినిమాకు భైరవం రీమేక్. ఈ సినిమాలో అన్ని రకాలు ఎమోషన్స్ ఉ ంటాయి. కొన్ని చోట్ల భావోద్వేగాలు లోపించాయి. యాక్షన్ పార్ట్ సినిమా ఫ్లేవర్‌ను మార్చేసింది. పాటల బాగున్నప్పటికీ వాటి ప్లేస్ మెంట్ సరిగా లేకపోవడం వల్ల మంచి ఫ్లోలో వెలుతున్న స్టోరికి బ్రేకులు వేశాయా? అనిపిస్తుంది. ఈ సినిమా పక్కా మాస్ ఎంటర్‌టైనర్. బెల్లంకొండ శ్రీను, నారా రోహిత్, మనోజ్ మంచు ఫెర్ఫార్మెన్స్ ఈ సినిమాకు హైలెట్. కథ పరంగా పాత కథే.. కాకపోతే డిఫరెంట్‌గా చేయాలన్న ప్రయత్నం కొంత ట్రాక్ తప్పింది. టోటల్‌గా ఈ సినిమాను థియేటర్‌లో ఓసారి చూసేయొచ్చు అనేది నా అభి్ర-పాయం.




PRINTED, PUBLISHED & and OWNED by T VIJAYANAND, And PRINTED at M/S JBN PUBLICATIONS, # 2/381-A - RAGITHOTA PALEM, Near SHALOM CHURCH, Tadipatri - 515411 Anantapuram District, Andra Pradesh. Published at M/S JBN PUBLICATIONS, # 2/381-A, RAGITHOTA PALEM, Near SHALOM CHURCH, Tadipatri - 515411 Anantapuram District, Andra Pradesh. PIN - 515411. Editor T VIJAYANAND, RNI NO: APTEL/2015/72694. Cell : 8886090199. E-mail ID : ananthaprabha@gmail.com